# లోక సంబంధియైన మానవుడు

**పాఠ్యోద్దేశం :** అనారోగ్యకరమైన వ్యక్తిత్వము, బలహీనమైన శీలములను మానవుడు ఎట్లు పెంపొందించుకొనునో తెలిపి, వానియొక్క చెడ్డ క్రియల ద్వారా ఇవి ఎట్లు బయలుపడునో చూపుట.

## ఉపోద్ఘాతము

*మీ అపరాధములచేతను పాపములచేతను మీరు చచ్చినవారై యుండగా, ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రదికించెను. మీరు వాటిని చేయుచు, వాయు మండల సంబంధమైన అధిపతిని, అనగా అవిధేయులైన వారిని ఇప్పుడు ప్రేరేపించు శక్తికి అధిపతిని అనుసరించి, యీ ప్రపంచ ధర్మముచొప్పున మునుపు నడుచుకొంటిరి. వారితో కలిసి మనమందరమును శరీరముయొక్కయు మనస్సుయొక్కయు కోరికను నెరవేర్చుకొనుచు, మన శరీరాశలను అనుసరించి మునుపు ప్రవర్తించుచు, కడమ వారివలెనే స్వభావసిద్ధముగా దైవోగ్రతకు పాత్రులమై యుంటిమి.* *ఎఫెసీ. 2:1-3*

లోకమునందు అను పరిధిలోని పరిస్థితులను గూర్చిన ముందరి మూడు పాఠములను యీ లేఖనము మొత్తముగా చేసి (sums up) చూపుచున్నది. తమ పాపములనుబట్టి ఆ పరిధిలోని మానవులు, ఆత్మీయముగా మరణించిరని ఈ పాఠములలో మేము నిర్ధారించియుంటిమి. మనస్సు యొక్కయు, హృదయము యొక్కయు దురాశలను అనుసరించి జీవించువారి జీవితములను అపవాది ఏలు చున్నాడు. తత్ఫలితముగా, దేవుని ఉగ్రత వారి మీదికి దిగెను. నూతన జన్మ ద్వారా "లోకములో నుండి" విడుదల పొంది "క్రీస్తునంద"లి దేవుని రాజ్యములోనికి ప్రవేశించిన రోమా పట్టణములోని క్రైస్తవులకు పౌలు యీ క్రింది ప్రశ్న వేయుచున్నడు.

*అప్పటి క్రియలవలన మీకేమి ఫలము కలిగెను? వాటినిగురించి మీరిప్పుడు సిగ్గుపడుచున్నారు కారా? వాటి అంతము మరణమే.* *రోమా. 6:21*

"లాభము శూన్యము"(no benifit) అని నొక్కిచెప్పుటే పౌలు ప్రశ్నకు జవాబుని, ఈ పాఠములో చూపెదము. లోకమునందు అను పరిధిలోని శక్తులు, వాతావరణము, కార్యక్రమము అనునవి, అందలి ప్రజల శీలమును, ఘోరముగా ఎట్లు పాడుచేయునో, అనారోగ్యకరమైన వ్యక్తిత్వ లక్షణము లను వారెట్లు పెంపొందించు కొందురో మనము నేర్చుకొందుము.

## పాఠము

శీలము (charector), వ్యక్తిత్వము (personality) లను పదములు దేవుని వాక్యములో ప్రయోగింపబడలేదు. వెబ్‌స్టరు నిఘంటువు (Webster's Dictonary) ప్రకారము మానవులకు సంబంధించి శీలము- ఒక ప్రత్యేకగుణము (a distinctive quality). వ్యక్తిత్వము (మూర్తి మంతము) అనునది గుణము (quality) ఒక వ్యక్తిగా నుండుస్థితి, అంతేకాదు ఒక వ్యక్తియొక్క ప్రవర్తన ఉద్వేగవైఖరుల మొత్తము (totality of an individuals behavioral and emotional tendencies); మరియు వ్యక్తియొక్క ప్రత్యేక (distinguishing) గుణగణములు (character traits), వైఖరులు (attitudes) లేక అలవాట్లు (habits)కు సంబంధించిన ఒక వ్యవస్థ (organization).

మానవప్రవర్తన, ఉద్వేగములకు సంబంధించి మంచివియు, చెడ్డవియునైన, లక్షణములను గూర్చి బైబిలు రచయితలు వ్రాసిరి. దేవునికి ఏవి అంగీకారమో లేక ఏవి అభ్యంతరమో అనుదానికి సంబంధించి దేవునివాక్యము మనలను చీకటిలో వుంచలేదు. దేవునికభ్యంతరకరమైనవిగా చూపించ బడిన లక్షణములు మనకు అనా రోగ్యకరమైనవని మనము భావించవలసియున్నది. అనగా, అవి మనయొక్క **క్షేమమును ఆనందమును** నాశనము చేయును. "స్వభావము" (self) అనుమాట ఈ క్రింది లేఖనములో ప్రయోగించబడిన రీతిలో శీలము, వ్యక్తిత్వము అను మాటలను ఈ పాఠములో వుపయోగించుదము.

*కాబట్టి అన్యజనులు నడుచుకొనునట్లు మీరికమీదట నడుచుకొన వలదని ప్రభువు నందు సాక్ష్యమిచ్చుచున్నాను. వారైతే అంధమైన మనస్సుగలవారై, తమ హృదయ కాఠిన్యమువలన తమలోనున్న అజ్ఞానముచేత దేవునివలన కలుగు జీవములోనుండి వేరుపరచబడిన వారై, తమ మనస్సునకుకలిగిన వ్యర్థత అనుసరించి నడుచుకొను చున్నారు. వారు సిగ్గులేనివారైయుండి నానావిధమైన అపవిత్రతను అత్యాశతో జరిగించుటకు తమ్మును తామే కాముకత్వమునకు అప్పగించుకొనిరి. అయితే, మీరు యేసును గూర్చివిని, ఆయనయందలి సత్యము ఉన్నది ఉన్నట్టుగానే ఆయనయందు ఉపదేశింపబడిన వారైనయెడల మీరాలాగు క్రీస్తును నేర్చుకొన్న వారుకారు. కావున మునుపటి ప్రవర్తనవిషయములోనైతే, మోసకరమైన దురాశలవలన చెడిపోవు మీ ప్రాచీనస్వభావము (new nature)ను వదలుకొని మీచిత్త వృత్తియందు నూతన పరచబడినవారై, నీతియు యథార్థమైన భక్తియు గలవారై, దేవునిపోలికగా సృష్టింపబడిన నవీనస్వభావము (old self)ను ధరించుకొనవలెను.* *ఎఫెసీ. 4: 17-24*

పై లేఖనములో అన్యజనులు అనుమాట "లోకమునందు" అను పరిధిలోని వారిని తెలుపును. "క్రీస్తునందున్న" మనము అన్యజనులవలె నడువరాదని హెచ్చరింప బడితిమి. ఏలయనగా వారు తమ మనస్సునకు ఆలోచనలను జన్మింప (produce) చేయుటకు వారి మనస్సులు ఉపయోగింప బడలేదు. ఫలభరితమైన నిర్ణయములు వారు తీసికొనలేదు. తమ మనస్సులను వారుపయోగించిరి. గాని ఫలితములు వ్యర్థములు. ఈ విధమైన చింతన (thinking), జీవన విధానము (way of life)లకు లోక సంబంధులైన మనుష్యులెట్లువచ్చిరో మనము అన్వేషించుదము. పై లేఖనము నుండి ముందుగా మనము గమనింపవలసినదేమనగా, వారు అంధమైన మనస్సు గలవారైరి. దేవుని గూర్చిన సత్యము మరియు నిత్యజీవమును గూర్చిన సత్యము విషయములో వారు అజ్ఞానులు. వారి ఆలోచనలలో ఆత్మసంబంధమైన వాస్తవికత (the absolute reality of

spiritual things) మృగ్యము. కేవలము భౌతికమైన సంగతులను గూర్చి మాత్రమే వారు ఆలోచించుచున్నారు. అపొస్తలుడైన యోహాను లోకసంబంధి యైన మానవుని మనస్తత్వము (mentality)ను ఈ క్రింది లేఖనములో వివరించుచున్నాడు.

> *లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు జీవపుడంబమును తండ్రి వలన పుట్టినవికావు అవి లోకసంబంధమైనవే. 1 యోహాను 2:16*

రోమా 1:18-32 చదివిన యెడల, దేవుని యొక్క జీవములో నుండి అన్యులు (లోకసంబంధులైన మనుష్యులు) తమ్మునుతాము వేరుపరచుకొనిన విధానమును చూడగలము. దీర్ఘాతిదీర్ఘమైన ఈ ఉదంతమును క్లుప్తీకరించినయెడల, మనమిట్లు చెప్పుకొనగలము. **వారు దేవునిని విసర్జించిరి దేవుడు వారిని విడిచిపెట్టెను.** ఫలిత మేమనగా, వారి అభిలాషలు తుచ్ఛమైనవాయెను మనస్సులు భ్రష్టమాయెను. ఈ లేఖనము నుండి మూడు విషయములు గమనింపవచ్చును. మొదటిది - వారు దేవుని నుండి వేరుచేయబడినందున, వారి స్వభావమున (self)కు కీడు దాపురించినది. రెండవది -తమ సహజకోరికలను తృప్తిపరచుకొనుటకైన వారి యత్నములలో ఈ దుష్ట క్రియలు సంభవమాయెను. లైంగికవాంఛ ప్రమేయమును గమనింపవచ్చును. మూడవది -తమ వ్యక్తిత్వ శీలములకు సంబంధించి లైంగిక అక్రమ సమస్యతో పాటు **ఇరువది ఒకటి చెడ్డగుణములు** వరుసగా చెప్పబడినవి.

అన్యజనుల అజ్ఞానము తమ **హృదయ కాఠిన్యమునకు** వారిని నడిపించెనని అపొస్తలుడైన పౌలు ఎఫెసి. 4:18లో చెప్పుచున్నాడు. కాఠిన్యము అనుమాట "పోరోసిస్" (POROSIS) అను గ్రీకు మాట నుండి వచ్చినదీ. కఠినపరచుకొనుటను అది సూచించును. పోరోస్ అను ఒకవిధమైన రాతితో కప్పబడు విధానమును అది సూచించును. తమ్మునుగూర్చిన సత్యము విషయములో వారు గ్రుడ్డివారైరి. తమ్మును సృష్టించిన దేవుని దయ విషయములో వారు కఠినపరచబడిరి. తమ సహజకోరికలను తృప్తిపరచుకొని ఆనందమును వారు అనుభవించి యుండలేదు. తత్ఫలితముగా వారు బండబారిపోయిరి. వారి హృదయము కఠినమాయెను. అనగా, ఆరోగ్యకరమైనమంచి ఉద్వేగానుభూతులను వారు కలిగియుండలేదు. దేవుని జీవములో నుండి వారు వేరు చేయబడినందున, తమ సహజకోరికలు సంతృప్తిపరచబడు కార్యక్రమములను వారు అనుభవించి యుండలేదు.

మన సహజ కోరికలన్నింటిని తృప్తిపరచునని నిరీక్షించు ఒక విధానమును జీవితములో మనము అనుసరించుచుండినప్పుడు ప్రేమ, సంతోషము, సమాధానము వంటి ఆరోగ్యకరమైన ఉద్వేగములను అభివృద్ధిపరచుకొందుము. కఠిన హృదయులము గాక సునిశితత్వము గలవారమై యుందుము. భయము, కోపము మరియు ద్వేషము అనునవి, సంతృప్తిని మనము కనుగొనలేనపుడు కలుగు ఫలితములు. సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వము మీరు విసర్జించండి (ఎఫెసీ. 4:31).

లోక సంబంధులైన మనుష్యులు కఠినపరచబడిన తర్వాత ఎఫెసీ. 4:19లో చెప్పబడినట్లు వారియొక్క భ్రష్టత్వపు బాటలోని తదుపరిదశ ఏమిటో, మనము జాగ్రత్తగా గమనించుదము. కాముకత్వ మునకు తమ్మును తామే వారు అప్పగించు కొనిరి. "అసెల్జీయా" (ASELGIA) అను గ్రీకు పదము నుండి **కాముకత్వము** అను మాట తర్జుమా చేయబడినది. కామాతురత, శరీర సంబంధమైన దురాశయని దాని అర్థము. చట్టము నీతి అనువాటి విషయములో, ముఖ్యముగా లైంగికవాంఛ విషయములో నిర్బంధములేని స్థితిని అది సూచించును. నానావిధమైన అపవిత్రతను అత్యాశతో జరిగించుటయే దాని ఫలితమైయున్నది. ఎక్కువగా అనుభవించవలెనను లైంగిక అవినీతిని అనుసరించిరని దీనిభావము. రోమా పత్రిక మొదటి అధ్యాయములో మనము చూచి యున్నట్లుగా లైంగికపరమైన పెడత్రోవలకు వారినిది నడిపించెను.

లోక సంబంధియైన మనుష్యుని "స్వభావమును" (self) భ్రష్టత్వమునకు కొనిపోబడిన మార్గపు జాడను గుర్తించియుంటిమి. దేవుడు మరియు మానవ జీవితము కొరకైన ఆయన సంకల్పమును గూర్చిన అవగాహన లేకపోయినందున అది ఆరంభ మాయెను. అంధకారమైపోయిన వారి మనస్సులు, సంతోషముగా నుండగలుగు మార్గము విషయములో వారిని **అజ్ఞానములో** నుంచెను. ప్రేమ లోపించుటే దాని ఫలితమైయున్నది లేక, ముందుగా చూపించిన లేఖనములో చెప్పబడియున్నట్లు, వారి **"హృదయకాఠిన్యము"** వలన నానావిధమైన అపవిత్రతను అత్యాశతో జరిగించుటకు వారు తమ్మును తామే కాముకత్వమునకు అప్పగించుకొనిరి. కొన్నిసందర్భములలో వారి **కాముకత్వజీవితము** పురుషుడు పురుషునితో, స్త్రీ స్త్రీతో లైంగికవాంఛను తృప్తిపరచుకొను నీచవిధానమునకు వారిని నడిపించెను. ఈనాడు "అట్టికలయికలో తప్పేమిట"ని కొందరు అడుగుచున్నరు. అట్టివారికి మేమిచ్చు సమాధానమేమనగా, దేవుని కుమారునిగా పరలోకమును పోగొట్టుకొని నిత్యమును నరకములోనుండుట మాత్రమేగాక ప్రస్తుతము వారొక సమస్యను కలిగి యున్నారు. వారి అంతర్యపురుషుడు లేక స్వభావము **మోసకరమైనదురాశలతో** నాశనమాయెను. వారి వ్యక్తిత్వము పాడాయెను. దేవునిరాజ్యమును స్వతంత్రించుకొనగలుగునట్టి స్వభావశీలము, వ్యక్తిత్వములను వారు కలిగియుండలేదు. ఈ క్రింది లేఖనమును ఆలోచించుము.

> *అన్యాయస్థులు దేవునిరాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా? మోస పోకుడి విగ్రహారాధకులైనను వ్యభిచారులైనను ఆడంగితనము గలవారైనను పురుష సంయోగులై నను దొంగలైనను లోభులైనను త్రాగుబోతులైనను దూషకులైనను దోచు కొనువారైనను దేవునిరాజ్యమునకు వారసులుకానేరరు. 1 కొరింథీ. 6:9,10.*

కఠినహృదయులు నానావిధమైన అపవిత్రతను అత్యాశతో జరిగించుటకై తమ్మును తామే కాముకత్వమునకు అప్పగించుకొనుటకు గల హేతువేమో మన మిప్పుడు పరిశీలించుదము. బైబిలులోని క్రొత్తనిబంధన భాగములో వ్రాయబడిన ప్రతీసమస్యల పట్టీలోను లైంగిక అక్రమము న్నట్లు గమనించగలము (1 పేతురు 4:1-3; గలతీ. 5:19-21; 1 కొరింథీ. 6:9,10; 2 కొరింథీ. 12:21; కొలొస్స. 3:5; మార్కు 7:22,23; రోమా. 1:18-31). ఆరోగ్యకరమైన అనేక సహజ కోరికలను దేవుడు మానవునిలో నాటిన విధానమును మనము జ్ఞాపకము చేసికొనినయెడల, యిది అర్థ వంతముగానుండును. గత పాఠములో సూచించి యున్నట్లుగా, లైంగికవాంఛ మానవుని సహజ వాంఛలలో ఒకటి. మిగిలినవేవనగా ఆకలి, సాంఘీకఅంగీకారము, సాధన, మరియు భద్రత అనునవి. ఈ చివరి మూడు కోరికలను సంతృప్తిపరచు దేవుని సంకల్ప విషయములో అంధ కారములో నుండినప్పుడు, మానవులు తమ యొక్క ఆకలి, లైంగికవాంఛ అనువాటి విషయములో తీవ్రమైన సమస్యతోనున్నట్లు అగుపించుదురు.

దేవుని సంకల్పమును అర్థము చేసికొనుటకై భౌతిక లోకము-కాలము అనువాటితో పాటు ఆత్మీయము మరియు నిత్యత్వము అను వాటి భావన వారికి అవసరము. అంతమాత్రమున సరిపోదు. వారు దేవుని యందు కూడా నమ్మిక యుంచవలెను. **మానవులు దేవునివిషయమై అజ్ఞానులైనప్పుడు, తృప్తిపరచు కొనుటకు సంతృప్తికరమైన పథకము లేని మూడు బలమైన సహజ కోరికలు కలిగియుందురు.** దేవుని నిత్య కుమారులు అగునట్లు తమకొరకైన దేవునిసంకల్పమును వారు కలిగి యుండిన యెడల, వారి యొక్క సాధన, సాంఘీకఅంగీకారము మరియు భద్రత అను కోరికలకది తృప్తిపరచును. ఈమూడు కోరికలయొక్క సంతృప్తి, వారియొక్క ఆకలి, లైంగికవాంఛ అను వాటిని తమ స్వాధీనములో నుంచును.

వారు వెలిగింపబడినయెడల, అది ఈ క్రింది విధముగా జరుగును. దేవుడు పరిశుద్ధుడని వారెరిగియుందురు. కాబట్టి ఆకలి, లైంగికవాంఛ అను తమ యొక్క కోరికలను పరిశుద్ధమార్గము నందు సంతృప్తిపరచుకొనుటకు ఎక్కువగా ఆలోచన చేయుదురు. లోకమునందు అను పరిధిలోని మానవులు దేవుడనుగ్రహించు కుమారత్వమును గూర్చి ఎరుగనందున, దేవునియొక్క పరిశు ద్ధతను గూర్చి వారు ఆలోచన చేయరు. **పరిశుద్ధులుగా నుండవలెనను భావన వారు కలిగియుండ నందున**, తమకు కొంత లైంగిక సంతృప్తినిచ్చునని వారు తలంచు అపవిత్ర విధానములచేత యీడ్వబడుదురు. అదేవిధముగా ఆకలి అను వారి కోరికను సంతృప్తిపరచు కొనుటకు చేసిన అనేక ప్రయత్నములలో దురాశతో నిండిన తిండిబోతుతనముగా అదిమారెను (ఫిలిప్పీ. 3:18,19; తీతు 1:12). దురాశయనునది సంతృప్తిపరచుకొన యత్నించు విధానములో **ఉద్వేగముల (emotions)ను నేర్చుకొందము.**

మన సహజకోరికలను తృప్తిపరచునని మనము నిరీక్షించిన పరిస్థితులను మన మెదుర్కొన్నప్పుడు, అనారోగ్యకరమైనవి గాని ఆరోగ్యకరమైనవిగాని ఉద్వేగములు పెంపొందును. **దేవుని ఆజ్ఞలు మరియు ఆయన జీవనియమములను** మనము ఉపయోగించిన యెడల తృప్తిని కనుగొని, విశ్వాస్యత, ప్రేమలవంటి ఆరోగ్యకరమైన ఉద్వేగములను పెంపొందిచుకొందము. మన ప్రయత్నములలో మనము అక్రమ విధానమును వెంటాడిన యెడల మనమాశించుతృప్తిని కనుగొనలేము. తత్ఫలితముగా కోపము, ద్వేషములవంటి అనారోగ్యకరమైన ఉద్వేగ వైఖరులను పెంపొందించు కొందము. మన వ్యక్తిత్వములో మన ఉద్వేవైఖరులు ఒక భాగము.

దేవుని కుమారులుగా అభివృద్ధి చెందవలెనను దేవునియొక్క లక్ష్యమును మనము అంగీకరించి నపుడు, ఆ లక్ష్యమే మన సహజ కోరికలన్నింటిని యుక్తముగా సమగ్ర (integrates) పరచు. అనగా ప్రతీ సహజకోరికను తృప్తిపరచు గురిని మనము కలిగియుండి, ఒక సహజకోరిక విషయమైన గురి మరియొక సహజకోరిక విషయమైన లక్ష్యమును అభ్యంతర పరచనియెడల, మన సహజకోరికల మొత్తము తృప్తి (integration of all our drives)ని మనము కలిగియుందము. దేవుని కుమారత్వమును గూర్చిన నిరీక్షణ, మనము సరియైన మార్గములో పయనించుటకు బలము నిచ్చును. తత్ఫలితముగా, మన కొరకైన దేవుని గురిని గూర్చిన స్పష్టమైన దృశ్యము బలమైన శీలముకు సహాయకారిగా (conducive) ఉండును. సరియైన బాటలో చలించుటకు ఒక శక్తిని అది మనకిచ్చును. మన శీలమునకు శక్తికిని, మన సహజకోరికల సంతృప్తికొరకైన లక్ష్యములకును మధ్య సమన్వయము (correlation) గలదు. **భౌతిక పరిధికి, కాలమునకు మించని దృశ్యము (vision) మనలను బలహీన శీలులుగా విడిచిపెట్టును.** మనము బలహీనమైన శీలము కలిగి మనలను మనమే కాముకత్వమునకు అప్పగించు కొందము.

తమ సహజ కోరికల సంతృప్తి విషయమై సరియైన లక్ష్యములను ముఖ్యముగా, నిత్యమహిమ కొరకైన గురి విషయములో లోకములోని మానవులకు అపవాది గ్రుడ్డి తనము కలుగజేయు చున్నాడు. మానవులకు దేవుడనుగ్రహించు మహిమను మరుగు పరచెను. వాడు నశించిన స్థితిలోనే వారినుంచుచున్నాడు. కాబట్టి వారు తృప్తిలేనిస్థితిలో నున్నారు (2 కొరింథి. 4:4). వారు అపవాదివల నను, తమ సొంత పాపముల చేతను ఉరిలో పడియున్నారు. మోసకరమైన దురాశలవలన వారి "స్వభావము" చెడిపోయి నందున, వారికి సంతోషము లేదు. ఒకప్పుడు వారు మధురమైన, యధార్థవంతులైన పిల్లలే. కాని దేవుని విషయములో అంధకారమైన మనస్సుతో వారు పెరిగి యున్నారు. లోక సంబంధియైన మనుష్యుని గూర్చి ఈ క్రింది సంపూర్ణ చిత్రము చూపుటకు అపొస్తలుడైన పౌలు పాతనిబంధనలోని కీర్తనల గ్రంథము నుండి ఎత్తివ్రాయబడిన (excerpts) వాక్యములనెన్నింటినో వ్రాసియున్నాడు.

*ఇందునుగూర్చి వ్రాయబడిన దేమనగా- నీతిమంతుడు లేడు. ఒక్కడునులేడు. గ్రహించు వాడెవడునులేడు. దేవుని వెదకువాడెవడునులేడు అందరును త్రోవతప్పి యేకముగా పనికిమాలిన వారైరి. మేలుచేయువాడులేడు, ఒక్కడైననులేడు. వారి గొంతుక తెరచినసమాధి, తమనాలుకతో మోసముచేయుదురు వారిపెదవుల క్రింద సర్పవిష మున్నది వారినోటినిండ శపించుటయు పగయు ఉన్నవి. రక్తముచిందించుటకు వారి పాదములు పరుగెత్తుచున్నవి, నాశనమును కష్టమును వారి మార్గములలో ఉన్నవి. శాంతి మార్గము వారెరుగరు. వారికన్నులయెదుట దేవునిభయములేదు.*
*రోమా. 3:10-18.*

యేసుక్రీస్తు దేవునిరాజ్యముపై ప్రస్తుతము రాజు. లోకమందలి శక్తుల కంటే ఆయన అధికమైన శక్తిగలవాడు (ఎఫెసీ. 1:20-23). ఆయన రాజ్యసువార్తను అంగీకరించిన యెడల లోకమునందు అను పరిధిలోని మనుష్యులను విడిపించగల శక్తి ఆయన కలిగియున్నాడు.

*మీరీలాగున రక్షింపబడి మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క మహిమను పొంద వలెనని, ఆయన మా సువార్త వలన మిమ్మును పిలిచెను.* *2 థెస్స. 2:14*

## చర్చ కోసం ప్రశ్నలు

1. దేవుని ఉగ్రత యిప్పుడు ఎవరిపై నిలచియున్నదో అట్టి వారికి దేవుడు ఎట్లు సహాయము చేయును?
2. రోమా. 6:21లోని పౌలు ప్రశ్నకు జవాబేమి?
3. మోసకరమైన దురాశలవలన చెడిపోయినట్టి మానవునిలోని భాగమును గుర్తించుము.
4. వ్యక్తిత్వము, శీలము అను మాటలు బైబిలులో ప్రయోగింప బడకపోయినను దేవుడు, వాటితో వ్యవహరించునని మనకెట్లు తెలియును?
5. అన్యజనుల లోపమేమి?
6. దేవుని నుండి వేరయిన మార్గములో అన్యజనులు వేసిన మొదటి అడుగు ఏది? వారి “స్వభావము”నకు సంబంధించి దాని ఫలితమేమి?
7. మానవుని ఎట్లు కఠిన హృదయులైరి?
8. మానవులు కఠినహృదయులైన పిమ్మట ఏమి సంభవించును?
9. చెడిపోయిన “స్వభావము” గలవ్యక్తియొక్క అనారోగ్య ఉద్వేగములను ఐదింటిని వరుసగా వ్రాయుము.
10. క్రొత్త నిబంధనలో సమస్యాత్మక ప్రతిలేఖన జాబితాలోను లైంగిక అక్రమము కనుపించుటకు సరిపడిన కారణమిమ్ము.
11. తిండిపోతుతనము, లైంగిక అపవిత్రత అనువాటిని జయించుటకు నిత్య మహిమను గూర్చిన నిరీక్షణ మనకెట్లు సహాయము చేయగలదు?
12. లోకమునందు అను పరిధిలోని మానవులు యేసుక్రీస్తును చూడకుండునట్లు సాతాను ఎందుకు ఆయనను మరుగుపరచవలసి యున్నది?